

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ఆగే భీ జానేన తుం, పీఛే భీ జానేన తుం**

**జోభీ హై బస్ యహి ఇక్ పల్ హై!**

ముందేం జరుగుతుందో తెలియదు. వెనుక ఏముందో తెలియదు. మనకు ఉన్నది ఈ క్షణమే

'వక్త్' సినిమాలో కీలకమైన సన్నివేశంలో వస్తుందీపాట. 'వక్త్' సినిమా హిందీ సినీ ప్రపంచంలో తొలి 'మల్టీస్టారర్'. బాలరాజ్ సహానీ, సునీల్ దత్, రాజ్‌కుమార్, శశికపూర్, సాధన, షర్మిల టాగోర్ వంటి నటులు నటించిన సినిమా. బాల్యంలో తప్పిపోయి చివరలో కలిసే కుటుంబం కథ ఇది. పాటలు లేక సీరియస్‌గా ఉండే అమితాబ్ పాత్రకు నాందీ ప్రస్తావనలాంటిది రాజ్‌కుమార్ పాత్ర. 'యాదోంకి బారాత్' వంటి లాస్ట్ అండ్ ఫౌండ్ సినిమాలకు ప్రేరణ వక్త్. ఆ సినిమాలో ఒక పార్టీ జరుగుతుంది. ఆ పార్టీలో శశికళ పాత్ర మెడలోని వజ్రాల గొలుసును రాజ్‌కుమార్ పాత్ర దొంగిలించాలి. అదే పార్టీలో సునీల్‌దత్ సాధనల ప్రేమ ప్రకటితమవుతుంది. అదే పాట సమయంలో షర్మిలను ప్రేమిస్తున్న శశికపూర్ (ఆమెకు డ్రైవర్) తల్లి అనారోగ్యం పాలవుతుంది. ఇవన్నీ కథను భవిష్యత్తులో మలుపులు తిప్పే సంఘటనలు. అంటే ఈ పార్టీ పాట అంతటి కీలకమైన సన్నివేశంలో వస్తుందన్నమాట. చాలా హిట్ పాట. రవి సంగీత దర్శకత్వంలో ఆశాభోంస్లే అత్యద్భుతంగా పాడిన పాట ఇది. ఈ పాట ఇప్పటికీ శ్రోతలను ఉర్రూతలూపుతూ ఆలోచింపచేస్తున్న పాట ఇది. ఈ పాట 'ఎరినా లాల్ ' అనే అమ్మాయిపై చిత్రీకరించారు. ఆమె కనిపించేది ఇదొక్కటే సినిమాలో. కాని ఈ పాటతో ఆమె చిరంజీవి అయిపోయింది. గతం తెలియదు .భవిష్యత్తు తెలియదు. ఉన్నది ఈ క్షణమే, అనే అత్యంత తాత్త్వికమైన ఈ గీతం ఓ పార్టీలో, అదీ అందరూ ఆనందంగా సంబరాలు చేసుకోవాల్సిన పార్టీలో అన్నది దృష్టిలో పెట్టుకుంటే క్లబ్బు, క్లబ్బు పాటలు, పార్టీ పాటలకు భిన్నంగా తాత్త్వికంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ పాట రాసింది సాహిర్ లూధియాన్వీ.

క్లబ్బు పాటలకు, కేబరే పాటలకు సాహిత్య గంధం పూసి, ఆ పాటల స్థాయిని తాత్విక గీతాల స్థాయికి ఎదిగించిన గేయరచయిత సాహిర్. ముఖ్యంగా క్లబ్బు పాటలను వ్యక్తిత్వ వికాస ప్రేరణాత్మక గీతాలుగా రచిస్తూ, ఆనందంగా, హాయిగా జీవించమని ప్రభోదాత్మకంగా మలచాడు సాహిర్. క్లబ్బు పాటలకు గౌరవ ప్రదమైన స్థానాన్ని ఏర్పాటు చేశాడు తన పాటలద్వారా.

'జాల్'లో 'తద్బీర్ సే బిగడీ హువీ ' పాట సూపర్ హిట్ అవటంతో ఎస్డీ బర్మన్, సాహిర్‌ల సినిమాల్లో క్లబ్బు పాటలను ఏదో రూపంలో జొప్పించాలన్న ప్రయత్నాలు జరిగాయి. 'టాక్సీ డ్రైవర్' సినిమాలో ఏకంగా మూడు అత్యద్భుతమైన క్లబ్బు పాటలున్నాయి. ఈ సినిమాలో హీరోను ప్రేమించే మంచి క్లబ్బు డాన్సర్ మూడు పాటలు పాడుతుంది ఆ పాటల భావం సాహిర్ జీవన సిద్దాంతాన్ని ప్రతిబింబిస్తుంది.

**దిల్ సే మిలాకె దిల్ ప్యార్ కీజియే**

**కోయీ సుహానా ఇక్రార్ లేజియే**

**షర్మానా కైసా, ఘబ్‌రానా కైసా**

**జీన్ సె పహలే మర్ జానా కైసా?**

జీవితం క్షణికమే కాబట్టి ప్రతిక్షణం హాయిగా అనుభవిస్తూ, సుఖంగా బ్రతకాలన్నది సాహిర్ సిద్ధాంతం. అది అవకాశం దొరికినప్పుడల్లా ఆయన తన పాటలలో ప్రదర్శిస్తూ వచ్చాడు. జిందగీ హస్ నే గానే కే లియే హై పల్, దో పల్ అంటాడు 'జమీర్' అనే సినిమాలో. జీవితం నవ్వుతూ పాడుతూ జీవించేందుకు , ఇది క్షణికం అన్నదీ అమితాబ్ పాడే పాట పల్లవికి అర్థం. టాక్సీ డ్రైవర్ పాటలో కూడా హృదయంతో హృదయం కలిపి ప్రేమించాలి. ఒక అందమైన ఆమోదాన్ని తెలపాలి. సిగ్గుపడవద్దు. భయపడవద్దు. జీవించేకన్నా ముందే మరణించవద్దు అంటున్నాడు సాహిర్. ఇందులో జీవించే కన్నా ముందే మరణించవద్దు అన్నది కీలకం. సాధారణంగా అనేక జీవితాలు ఆరంభించకముందే అంతమైపోతాయి. ప్రేమ చిగురించేలోగా చిదిమి వేస్తారు. దాన్ని అణచుకుని జీవచ్ఛవంలా జీవిస్తూ అందిన దానితో రాజీపడతారు అధములు. జీవించేకన్నా ముందే మరణించటం అంటే ఇదే.

**ఫాస్‌లోంకి చావ్ మే , రస్ భరీ ఫిజా వోమే**
**ఇస్ జిందగీ కొ గుల్‌జార్ కీజియే**

దూరాల నీడలో, అందమైన ప్రకృతి ఒడిలో ఈ జీవితాన్ని పూలతోటలా మలచుకో

**ఆతీ బహారే, జాతీ బహారే**
**కబ్‌సే ఖడీ హై బఢీ కతారే**
**చారహీహై బేఖుదీ, కహరహీహై జిందగీ**
**దిల్‌కీ ఉమంగే బేదర్ లేజియే**

ఈ ప్రపంచంలో ఋతువులు వస్తూంటాయి పోతూంటాయి. ఎప్పటినుంచో పెద్ద వరుస ఉందీ వచ్చిపోయే ఋతువులది. కాబట్టి హృదయపు కోరికలను తీర్చుకోమంటోంది జీవితం.

**దిల్‌సే భులాకె రుస్ వాయియేంకో**
**జన్నత్ బనాలే తన్ హాయి యోంకో**
**ఆర్జు జవాన్ హై, వక్త్ మెహర్‌బాన్ హై**
**దిల్ ఖోన జాయే ఖుషీ యార్ కీజియే**

అన్ని బాధలు, కోపాలు, తాపాలు హృదయం నుంచి తొలగించి ఒంటరితనాన్ని స్వర్గంగా మలచుకో. కోరిక ఇంకా తాజాగానే ఉంది. సమయం ఉంది. ఈ సమయంలో బాధపడకు ఆనందం అనుభవించు. ఇది క్లబ్బులో నర్తకి పాడే పాట. ఇది సాహిర్ తత్వం. జీవితం అమూల్యమైనది. గడచిన క్షణం తిరిగిరాదు. తరువాత క్షణంలో ఏముందో తెలియదు. మనకి ఉన్నది ఈ క్షణమే. ఈ క్షణాన్ని మనం అనుభవించాలి. అది దొరకలేదని, వాడు ఇలా అన్నాడని, ఇదిలా జరిగిందని ఏడుస్తూ, తిట్టుకుంటూ బ్రతికే సమయం లేదు. ఉన్నది ఈ క్షణమే. దాన్ని చేజారనీయవద్దు. ఎందుకంటే తదుపరి క్షణం ఏమౌతుందో ఎవరికీ తెలియదు. ఇలా జీవితాన్ని అనుభవించమని, మనకు ఉన్నది ఈక్షణమేనని సాహిర్ క్లబ్బు పాటలలోనే కాదు, తన పాటలలో అవకాశం దొరికినప్పుడల్లా బోధిస్తూ వచ్చాడు. ఆనందం ఉన్నప్పుడే అనుభవించమని, చేతికందిన ఆనందాన్ని జారవిడుచుకోవద్దని చెప్తూనే వచ్చాడు తన చివరిపాటవరకూ.

టాక్సీ డ్రైవర్‌లోనే మరో క్లబ్బు పాట సందర్భంలో ఈ నిజాన్ని మరింత స్పష్టంగా చెప్తాడు.

**ఏయ్ మేరి జిందగీ, ఆజ్ రాత్ ఝూంలే,**
**ఆస్మాన్ కొ చూంలే**
**కిస్‌కో పతా కల్ ఆయేకి న ఆయే**

ఓ నా జీవితమా, ఈ రాత్రి ఆనందించు. అంబరాన్ని తాకే సంబరాలు చేసుకో. ఎవరికి తెలుసు, రేపు వస్తుందో రాదో.

**ఆజ్ హై దునియా తేరి, ఝూంలె ఓ మత్వాలే**

**ఆజ్ హై దునియా తేరి, యే అన్‌మోల్ జమానే**

**ఫిర్ నహి అనేవాలె, దేఖ్ యే రుత్ కహీ బీతన జాయే**

ఇప్పుడీ ప్రపంచం నీది. ఇప్పుడే అనుభవించు. ఇది అమూల్యమైనది. ఈ క్షణం ఈ ప్రపంచం మళ్లీ రాదు. దీన్ని పోగొట్టుకోకు. కాలం వ్యర్ధంగా గడచిపోనీయకు

**ఏక్ ఫల్ కట్ లీజాయే, సాస్ కీ నాజూక్ డోరీ**

**పల్ పల్ కట్ తీ జాయే, సాసోంకి నాజుక్ డోరీ**

**మౌత్ కీ సీనాజోరీ, అగ్ లే పల్ హి జానే క్యా హో జాయే**

మన ఊపిరి మన ప్రాణం. ఊపిరి నిరంతరం పీలుస్తూనే ఉంటాం. ఈ నిరంతర ఊపిరి ప్రవాహం క్షణక్షణం తగ్గిపోతూంటుంది. కాలం గడుస్తున్న కొద్దీ జీవితం అంతంవైపు పరుగిడుతూంటుంది. మృతువు వెలిగే దీపాన్ని ఆర్పి వేస్తుంది. మరుక్షణం ఏమౌతుందో తెలియదు. కాబట్టి ఇప్పుడు ఉన్న క్షణాన్ని ఆనందంగా అనుభవించాలి.

**ఆజ్ ఠహర్ హీన జాయే, ఢల్ తీ రాత్ కి సాయే**

**ఆజ్ ఠజర్ హీన జాయే, కల్ కిస్నే దేఖా హై**

**ఆయే యా ఆయే, ఆయే తోభీ జానే హమే పాయే కి న పాయే**

కరిగిపోతున్న రాత్రి ఆగిపోవాలి. రేపు ఎవరు చూశారు? వస్తుందో రాదో తెలియదు. రేపు వచ్చినా మనం ఉంటామో లేదో తెలియదు. కాబట్టి ఈ క్షణమే మనకు ఉన్నది. దాన్ని సంపూర్ణంగా అనుభవించాలి.

**అన్‌జానే సాయోంక, రాహోంమే డేరాహై**

**అన్ దేఖి బాహోనే హం సబ్‌కో ఘేరాహై**

**యే పల్ ఉజాలా హై, బాకీ అంధేరా హై**

**యే పల్ గవానాన, యే పల్ హీ తేరా హై**

**జీనేవాలే సోచలే**

**యహీ వక్త్ హై కర్ లే పూరి ఆర్జూ !**

'ఆగే భీ జానేన తుమ్' అన్న పల్లవి తరువాత చరణం ఇది. మన దారుల్లో మనకు తెలియని నీడలు దారిలో తిష్ట వేసుకుని ఉన్నాయి. మనకు కనబడని బాహువులు మనల్ని చుట్టుముట్టి ఉన్నాయి. మనకు కనబడేది ఈ క్షణమే. మిగతా  అంతా చీకటి. కాబట్టి ఈ క్షణం నీది. దీన్ని కోల్పోకు.. మనుషులారా, ఆలోచించండి, కోరికలు తీర్చుకొనటానికి ఇదే సమయం, కోరికలు తీర్చుకోండి. ఇది పార్టీలో పాట.

ఒక్క క్షణం సేపు ఆగి ఆలోచిస్తే సాహిర్ గొప్ప జీవిత సత్యాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించాడని అర్ధమవుతుంది. నిజానికి మనది గుడ్డి బ్రతుకు. మనం తెలివిమంతులం అనుకుంటాం. అది సాధించాం. ఇది సాధించాం అనుకుంటాం. కానీ మరుక్షణం ఏమౌతుందో మనకు తెలియదు. ఏ అడుగులో ఏముందో తెలియదు. అలానే గుడ్డిదారులలో ప్రయాణిస్తున్నాం. ఈ నిజాన్ని సాహిర్ మనకు పరిచితం లేని నీడలు మన దారుల్లో పరుచుకుని ఉన్నాయి. కనబడని బాహువులు మనల్ని చుట్టుముట్టి ఉన్నాయని అద్భుతంగా చెప్తున్నాడు.

ఇదే సత్యాన్ని టాక్సీ డ్రైవర్ క్లబ్బు పాటలో మరో రకంగా చెప్తాడు. కానీ అర్ధం జీవితాన్ని అనుభవించమనే.

**జీనేదో ఔర్ జియో**

**చఢ్ తీ జవానీక దిన్ హై**

**ఫిర్ ఐసా సమా మిలేగా కహా**

**యహీ జిందగీ కె దిన్ హై**

**మర్‌నాతొ  సబ్ కో హై జీకేభి దేఖలే**

**చాహత్ క ఎక్ జాం పీకేభి దేఖ్‌లే**

బ్రతుకూ బ్రతికించు. ఇవి యవ్వనం రోజులు, మళ్లీ ఇలాంటి కాలం దొరకదు. అందరూ మరణిస్తారు. నువ్వు బ్రతికి చూపించు. ప్రేమ మత్తును స్వీకరించి చూపించు.

ఇదీ క్లబ్బు పాట

**యే హవా యే ఫిజా, కహతీ హై ఝూం లే మజాలే**

**కోయీ ఫూల్ చున్, కోయీ ఖ్వాబ్ బున్**

**దిల్‌కా  ముఖద్దర్ జగాలే**

ఈ ప్రకృతి ప్రేమించమని చెప్తోంది. ఏదైనా కలలు అల్లుకో. అదృష్టాన్ని జాగృతం చేయి. అందరూ మరణిస్తారు. నువ్వు జీవించి చూపించు

**యే హసీన్ జిందగీ  హై ఇక్ రసీలా తరానా**

**న లే దిల్ మె గం, ఓ మేరీ సనం**

**కి హై యే ఖుషీ కా జమానా**

ఇది అందమైన జీవితం. బాధను దరిచేరనీయకు. ఎందుకంటే జీవితం ఆనందమయం. ఇలా ఉన్నది ఈ క్షణమే. లభించేది ఒకే జీవితం. దాన్ని ఆనందంగా అనుభవించమని మరింత స్పష్టంగా ఆగే భీ జానేన తుం పాటలో ప్రదర్శిస్తాడు సాహిర్.

**ఇస్ పల్ కే జల్వోనే మహఫిల్ సవారీ హై**

**ఇస్ పల్ కీ గర్మినే ధడ్ కన్ ఉభారీ హై**

**ఇస్ పల్ కేహోనేసే దునియా హమారీ హై**

**యే పల్ జోదేఖోతో సదియోంపె భారీ హై**

**జీనే వాలే సోచ్‌లే**

**యహీ వక్త్ హై కర్ లే పూరీ ఆర్జూ**

ఈ క్షణంలోని ఆనందమే ఈ సందర్భాన్ని ఆనందమయం చేస్తోంది. ఈ క్షణంలోని వెచ్చదనమే హృదయాన్ని పరుగెత్తిస్తోంది. ఈ క్షణం ఉంది కాబట్టి ఈ ప్రపంచం మనది అయింది. ఈ క్షణం కొన్నివేల యుగాలకన్నా అమూల్యమైనది కాబట్టి ఈ క్షణమే కోరికలను తీర్చుకో. ఈ చరణంలో చేతిలో ఉన్న ఈ క్షణం రాబోయే కొన్ని యుగాలకన్నా విలువైనది అనటం అతి గొప్పగా అనిపిస్తుంది. ఎందుకంటే మొదటి నుంచీ చెప్తున్నాడు మరుక్షణం ఏమౌతుందో మనకు తెలియదు. కాబట్టి చేతిలో ఉన్న ఈ క్షణమే అమూల్యం. ఇది ఒకరకంగా సంప్రదాయంపై తిరుగుబాటు. ఇపుడు పుణ్యం చేయి తరువాత స్వర్గం లభిస్తుంది అని ఇప్పటి క్షణాల ప్రత్యక్ష ఆనందాలను ఎప్పుడో ఎక్కడో లభించే ఆనందాల కోసం వదులుకోమనటం అర్థంలేనిదని అనటం.

ఇస్ పల్‌కె సాయేమె అప్నా ఠికానా హై
ఇస్ పల్ కె ఆగే కి హర్ షై ఫసానా హై
కల్ కిస్నే దేఖాహై, కల్ కిస్నే జానా హై
ఇస్ పల్ సే పాయేగా జో తుఝ్‌కో పానాహై

ఈ క్షణం నీడలోనే మన నివాసం. ఈ క్షణం దాటితే ప్రతీదీ కథనే. గతమే . రేపు ఎవరు చూశారు? రేపటి గురించి ఎవరికి తెలుసు? ఏమి అనుభవించాలన్నా ఉన్నది ఈ క్షణమే. కాబట్టి సమయం ఉన్నప్పుడే కోరికల్ను పూర్తిచేసుకో.

ఇదీ సాహిర్ తత్వం. హిందీ సినీ ప్రపంచంలో సాహిర్ ఎలాంటి కవి అంటే సందర్భం ఏదైనా తనకు నచ్చిన రీతిలో, తాను రాయాలనుకున్నది రాశాడు తప్ప ఎవరో చెప్పారని తన రచనను మార్చలేదు. నిజానికి ఆనందంగా అనుభవించవలసిన పార్టీలో ఇలాంటి తాత్త్విక గీతం నప్పకూడదు. కానీ సాహిర్ గొప్పతనం ఏమిటంటే ఈ పాటవల్ల సందర్భం మరింత గొప్పగా అనిపిస్తుంది. సందర్భం గాంభీర్యాన్ని సంతరించ్చుకుంటుంది. ఆ పార్టీ సందర్భంగా సంభవించిన కొన్ని సంఘటనలు సినిమాను కీలకమైన మలుపులు తిప్పి ప్రభావితం చేస్తాయి. కానీ ఆ క్షణంలో పాత్రలకు తెలియదు అప్పుడు జరుగుతున్న సంఘటనల వల్ల తమ జీవితాలు తిరిగే మలుపులు. అందుకే సాహిర్ సంబరాల పార్టీ పాటను 'ఆగే భీ జానేన తుం' అని రాసినా అది సందర్భానికి తగ్గట్టు ఒదగటమే కాదు సినిమాను ముందుకు తీసుకువెళ్లి స్క్రిప్టులో భాగమైపోయింది. సినిమాతో, సందర్భంతో విడదీయదానిదై కూడా సార్వజనీన భావనను ప్రదర్శిస్తూ ప్రతి ఒక్కరి హృదయం స్పందించేట్టు చేస్తోంది. మార్గదర్శనం చేస్తోంది. క్లబ్బు పాటను ద్వంద్వార్థాల అశ్లీల గీతాలుగా ప్రతిభ లేని కళాకారులు మలచారు. కానీ ప్రతిభ ఉన్న సాహిర్ క్లబ్బు గీతాలను తాత్త్విక గీతాలుగా, ప్రబోధాత్మక గీతాలుగా, బ్రతకటం నేర్పించే వ్యక్తిత్వ వికాస గీతాలుగా మలచాడు. గమనిస్తే సంగీత దర్శకుడు రవి సృజించిన పాటలన్నిటిలోకీ భిన్నంగా నిలుస్తుందీపాట. పహాడీ రాగంలా తోచని పహాడీ రాగం పాట ఇది. ఇంత అద్భుతంగా రాగాన్ని మలచటం రవి సంగీత దర్శకత్వంలోని ఏ పాటలోనూ కనబడదు. దీని వెనుక ఓ కథ ఉంది.

'వక్త్ ' సినిమాకు ఆనాటి మేటి సంగీత దర్శకులుగా శంకర్‌జైకిషన్‌లను ఎంచుకున్నాడు నిర్మాత చోప్రా. కానీ సాహిర్ గీతాలను రచిస్తాడని నియమం పెట్టాడు. శంకర్‌జైకిషన్ అందుకు ఒప్పుకోలేదు. శైలేంద్ర, హస్రత్ జైపురిలే తమకు పాటలు రాస్తారని వారు సినిమాను వదులుకున్నారు. దాంతో రవికి సంగీత దర్శకత్వం వహించే అవకాశం లభించింది. కానీ శంకర్‌జైకిషన్‌లాంటి సంగీతం సృజించాలి. అదే సమయంలో 'ఆయీమిలన్‌కీ బేలా' తో శంకర్‌జైకిషన్ సంగీత దర్శకత్వం వహించిన సినిమా విడుదలయింది. దాన్లో ఓ సందర్భంలో నేపథ్యంలో ఓ బాణీ వినిపిస్తుంది. అది రవికి నచ్చింది. శంకర్‌జైకిషన్ అనుమతితో ఆ బాణీని 'వక్త్'లో పాటగా మలిచాడు. అదే 'ఆగేభీ జాన్ న తు ' అందుకే ఈ పాట రవి పాటలాగా అనిపించదు. అయితే బాణీని మరపింపచేస్తూ పాటలో పదాలు అన్నిటినీ డామినేట్ చేసే రీతిలో రచించాడు సాహిర్. పార్టీ ఫాటల్లోకి భిన్నమైన పాటలా నిలిపిపాడు. తేలికగా కొట్టివేసే పార్టీ పాటను తాత్త్విక గీతం స్థాయి ఎదిగించాడు సాహిర్. ఆనాటి కళాకారుల ప్రతిభ అది. వారి ఉత్తమ వ్యక్తిత్వం ఇది.

*(వచ్చే నెల మళ్లీ)*

Post your comments